నినాదం
నిఖార్సైన జర్నలిజం
సాహితీ లహరి
ఆదివారం 15-03-2026

# డా. ఎన్. గోపి చెప్పులు కవిత-సామాజిక అస్తిత్వ చిత్రణ

**ఆచార్య ఎన్. గోపి ఆధునిక తెలుగు సాహిత్యంలో మానవీయతను, సామాజిక స్పృహను మమేకం చేసిన విశిష్ట కవి. ఆయన కవితాదృక్పథం మట్టి మనుషుల జీవన పోరాటాన్ని, పల్లె నేపథ్యాన్ని, లోతైన తాత్వికచింతనను ప్రతిబింబిస్తుంది. సంప్రదాయ మూలాలను గౌరవిస్తూనే, 'నానీలు' వంటి ఆధునిక ప్రక్రియల ద్వారా సామాజిక వైరుధ్యాలను ఎండగట్టి, రేపటిపై ఆశను చిగురింపజేయడం ఆయన ప్రత్యేకత. ముఖ్యంగా 'జలగీతం'లో పర్యావరణ స్పృహను, 'వృద్ధోపనిషత్'లో వయసు మళ్ళిన వారి అంతరంగ వేదనను, 'చిత్రదీపాలు'లో జీవిత సత్యాల పట్ల నిశితమైన పరిశీలనను ఆయన అత్యంత ఆర్ద్రంగా ఆవిష్కరించారు. క్లుప్తత, సరళత కలగలిసిన ఆయన రచనలు ప్రకృతి పట్ల బాధ్యతను, మనుషుల మధ్య ఉండాల్సిన అనుబంధాలను నిరంతరం ప్రబోధిస్తూ సామాన్యుడి కష్టసుఖాలకు అద్దం పడతాయి. డా. ఎన్. గోపి గారి "చెప్పులు" కవిత భారతీయ సామాజిక వ్యవస్థలో దళితుల కులవృత్తి, సామాజిక అస్తిత్వం, శ్రామిక చరిత్రకు సంబంధించిన తాత్వికాంశాలను చర్చకు పెడుతుంది. అలాగే, ఇటీవల ఆయన రచించిన చెప్పులు కవిత ఆయనకు గొప్పపేరుతెచ్చింది."చెప్పులు" కవిత భారతీయ సామాజిక వ్యవస్థలో దళితుల కులవృత్తి, సామాజిక అస్తిత్వం, శ్రామిక చరిత్రకు సంబంధించిన తాత్వికాంశాలను చర్చకు పెడుతుంది.**

"కొత్త చెప్పులు కొన్నప్పుడల్లా
పాత చెప్పులు పారెయ్యను
స్టాండ్ లో జాగ్రత్తగా పెడతాను
అవి కేవలం పాదరక్షలు కాదు
నా అనుభవాలకు సాక్షులు." ఈ కవిత అనుభూతి సాంద్రతతో ప్రారంభమవుతూ మానవ సంబంధాలను ప్రతిఫలించేలా ఎత్తుకున్నారు. పాత చెప్పులను పారేయకుండా "స్టాండ్ లో జాగ్రత్తగా పెడతాను" అనే వాక్యంతో పాత చెప్పులను కేవలం వస్తువులుగాకాక, జీవిత పయనంలో సహచరులుగా చూడటంగా స్పష్టమవుతుంది. ఇది భావపూరిత కృతజ్ఞతకు సంకేతంగా చెప్పుకోవచ్చు.

ఒకప్పుడు చెప్పులు కుట్టడం అనేది కేవలం ఆర్థికపరమైన విలువ మాత్రమే కాదు. ఆ వ్యక్తుల పట్ల ఉండే మమతానురాగాలను తెలియజేసేది. అందుకే కొంతమందికి కిర్రిచెప్పులను కవితలో చెప్పులు కేవలం పాదరక్షలు మాత్రమే కాక, దళితుల కులవృత్తి అయిన చెప్పుకుట్టడం, శ్రామిక జీవనంతో ముడిపడి ఉంది. ఒక సామాజిక సాంస్కృతిక వారసత్వాన్ని తెలియజేస్తుంది. ఒకప్పుడు అది వంశపారం పర్య నిర్బంధ కులవృత్తి. సమాజంలో డబ్బున్నవాళ్లు తమ పశువులను ఇచ్చి చెప్పులు చేయించుకునేవారు. ఆ విధంగా చెప్పులు చేసినందుకు ఆ కులవృత్తి వారికి జీవనం కొనసాగినా, ఆర్థికపరమైన తోడ్పాటు పెద్దగా లభించేది కాదు. ఆ విధంగా భారతీయ సామాజిక వ్యవస్థలో దళితులు సంప్రదాయంగా చెప్పులుకుట్టడం వంటి పనులకు కేటాయించబడ్డారు. ఇది ఆర్థికపరమైన సమాజపు శ్రేణీకరణని సూచిస్తుంది. ఆ సామాజిక శ్రేణికి చెందిన వారు కాకపోయినా, వారి పట్ల సహానుభూతి కలిగిన కవి ఆ చరిత్రను కవిత్వీకరిస్తూ..

"కొత్త చెప్పుల్ని చూస్తే
నా దళిత మిత్రుని తండ్రి గుర్తుకొస్తాడు
పవిత్రమైన శ్రామిక చరిత్రంతా
వాటిలో నిక్షిప్తమై వుంది." అన్నారు. "నా దళిత మిత్రుని తండ్రి గుర్తుకొస్తాడు" అనడం ద్వారా కవి వ్యక్తిగత అనుభ వాన్ని సామాజిక అవగాహనగా విస్తరింపజేస్తారు. అంతే కాదు, కొన్నింటితో మన సామాజిక అస్తిత్వం ఎలా ముడిపడి ఉంటుందో కూడా వ్యక్తమవుతోంది. చెప్పులు లేకుండా తిరిగిన రోజులుగానీ, నిత్యం కొత్తవాటిని ధరించడం ఒకరక మైన సామాజిక స్థితి నిదర్శనంకావచ్చు.

"ఆయా దశల్లో
స్థోమతను బట్టి వాటి ఖరీదు.
చెప్పులు లేకుండా
తిరిగిన రోజులను మర్చి పోలేదు...
మా అక్క కొనిచ్చిన చెప్పులు
ఇప్పటికీ మమతల మందారాలు"
ఎప్పటికప్పుడు కొత్త చెప్పుల కొనుక్కోవడం ఆ వ్యక్తి ఆర్థిక స్థోమత సామర్థ్యాన్ని ప్రతిబింబిస్తుంది.కానీ, దాన్ని దాచుకోవడంలో ఆ శ్రమ, ఆ చరిత్ర, ఆ మానవ సంబంధాలు సజీవంగా నిలుపుకోవడాన్ని సూచిస్తుంది. చెప్పులను తన ప్రయాణ సౌందర్యం సాధనాలుగా అభివర్ణించడంలో కూడా గొప్ప తాత్వికత ఉంది.

అక్క ఇచ్చిన చెప్పులు మమతల గుర్తుగా మారడమనేది కేవలం ఒక్క అక్కకే పరిమితం కాదు. ఆ చెప్పులు తన దగ్గరకు వచ్చే క్రమంలో మన స్నేహాలు, బంధాలు, వాటిని నిలుపుకోవడమో, మధ్యలోనే త్రుంచుకో వడమే కూడా తెలుపుతుంది. అందుకే కవి ఆ చెప్పుల్లో అంత సాన్నిహిత్యాన్ని దర్శించి గలిగారు.

"రాళ్ల నుంచీ ముండ్ల నుంచీ
పాదాలను కాపాడిన ఆపన్న హస్తాలు
ముఖ్యంగా ఎండల్లో
నన్ను అరచేతుల మీద మోసిన దీవెనలు"
అని చెప్పుల కుట్టే కృషి సమాజాన్ని ముందుకు తీసుకెళ్లిన స్థితిని ప్రశంసిస్తుంది. అయినా అది చరిత్రలో గుర్తింపు పొందని అమూల్య శ్రామిక సాంస్కృతిక వారసత్వంగా



మిగిలిపోయింది. దానికి కారణం ఆ పని ఆర్థిక వ్యవస్థతో ముడిపెట్టడం. అది క్రమేపీ ఆర్థిక ఆధిపత్యంతో కొంతమంది దళితులను ఎదగనీయకుండా చేసింది. అందువల్ల చెప్పులు కుట్టడం అనేది చరిత్రపుటల్లో ప్రతిష్ఠాహీనతగా మాత్రమే గుర్తింపుకునోచుకుంటుంది. కాలక్రమంలో అది తయారు చేసిన వాళ్లతో పాటు ఆ వస్తువు కూడా హీనత్వానికి గురయ్యింది. దాన్ని కవివర్ణిస్తూ... ఒక హెచ్చరికను, దాని వెనుక విస్మరించిన చరిత్రను గుర్తించమంటున్నారు.

"చెప్పుతో కొడ్తా అని
వాటిని న్యూన పరచొద్దు
పాదుకల్ని ప్రతీకగా పెట్టి
రాజ్యా లేలిన వాళ్ళున్నారు."
"చెప్పుతో కొడ్తా" అనే పదం న్యూనపరచబడిన ఆత్మగౌరవం అనే సామాజిక అవమానానికి సూచన. అలా అవమానించడాన్ని కవి తీవ్రంగా వ్యతిరేకిస్తారు. చెప్పులు కేవలం పాదరక్షలు కాదని, దళితుల శ్రమకు ప్రతీకలని ప్రకటిస్తారు.

"పాదుకల్ని ప్రతీకగా పెట్టి రాజ్యా లేలిన వాళ్ళున్నారు" అనడం ద్వారా చెప్పులు విముక్తి రాజకీయాలను కూడా సూచిస్తాయి. మళ్ళీ రాజ్యాలేలే రోజులు రావచ్చని అవమానించేవాళ్ళని హెచ్చరిస్తున్నారు. ఒకదాని వెనుక వెంటనే ఆ భావాన్ని ప్రతిపాదించడంలో కవిత్వ నిర్మాణవ్యూహం ఉంది.

దీన్ని విరోధ చైతన్యం అంటారు. చెప్పుతో కొడతా అనేది ఒక వ్యక్తి కి సంబంధిం చిన భావన కాదు. అది సామాజిక సంస్కార సంకేతం. దాన్ని కవి తిరస్కరిస్తూ, రాజ్యాలు ఏలిన పాదుకలు అని చెబుతారు. దాన్ని పవిత్రీకరిస్తూ వాటికెంత శక్తి ఉందో తేలుసుకోమంటూ. రామాయణంలో శ్రీరాముడు అరణ్యవాసం వెళ్ళాల్సివచ్చినా, ఆయన చెప్పులనే సింహాసనంపై పెట్టుకొని పరిపాలించిన రాజ్య చరిత్ర చెప్పులు ఉందంటారు కవి.

"అర్థమైందా మిత్రమా!
చెప్పులు నా గత కాల గ్రంథంలోని పుటలు
కాలోజ్వల అనర్ఘ సుదీర్ఘ మార్గంలో నడిచి
ప్రస్తుతం విశ్రాంతి తీసుకుంటున్న బాటసారులు." అని కవి వర్ణించడంలో గతం నుంచి వర్తమానం, భవిష్యత్తుని ఊహిస్తూ కాలోజ్వల మార్గంలో ఏదొకనాడు ఆ చెప్పులే దళిత చరిత్రకు కొత్త పునఃవ్యా ఖ్యానాన్ని అందిస్తాయని అంటున్నారు. మొత్తం మీద డా.ఎన్. గోపి గారి "చెప్పులు" కవితలో చెప్పులను ఒక సామాన్య వస్తువుగా కాక, దళితుల కులవృత్తి, సామాజిక శ్రామిక చరిత్ర, ఆత్మగౌరవ పోరాటం, సామాజిక వ్యతిరేకత, సాంస్కృతిక గుర్తింపు, భవిష్యత్తులో మహాశక్తి వంతులవుతారనే దార్శనికత వంటి అనే అంశాలకు ప్రతీకాత్మక విస్తరణగా కనిపిస్తుంది. ఈ కవిత భారతీయ సామాజిక వ్యవస్థలో కుల ఆధిప త్యాన్ని ప్రశ్నించే తాత్వికతకు గొప్ప చైతన్యంగా నిలుస్తుంది.



- డా.దార్ల వెంకటేశ్వరరావు
ప్రొఫెసర్, తెలుగు శాఖ,
యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్,
హైదరాబాద్, ఫోన్: 9989628049

## రాధమ్మ ఎదురుచూపులు

ప్రతి జాములో
ఒత్తిగిలిన నిదురలో
దిగులైన మనసుతో
వాలిందేమో....
తెల్లవారుజాముల్లో
రంగవల్లులు వేయలేక
చుక్కల ముగ్గుల్లో
మూగబోయింది !
యుగాలుగా
చల్లడమే కన్నీళ్ల కల్లాపి
చల్లిందేమో.....
ఉషోదయాలను
బరువైన ముచ్చటగ
పలకరించింది !

మధ్యాహ్నాలన్నీ
నడి నెత్తిన రవిలా
నిమురుతాడనుకుందేమో ...
గడప బయటే
నిట్టూర్పు నిచ్చెనగ
వేచి నిలబడింది !
మల్లె మొగ్గల వేళలన్నీ
అనురాగాల రెమ్మై
పలకరిస్తాడనుకుందేమో....
ప్రతి పందిరి నిండా
వలపుల విరహంగ
విరబూసింది !

చంద్రకాంతల వేళలన్నీ
కాంత దర్శనానికి
తప్పక వస్తాడనుకుందేమో...
ప్రతి తరం వెంటా
కృష్ణారాధనలో
ఎదురుచూస్తూనే ఉంది !!

- మృదుల...

## సోషల్ మీడియా పరిచయాలు జీవితాలు అభాసుపాలు

అనంతమైన అంతర్జాలంలో సోషల్
మీడియా వేదికల జోరు కొనసాగుతుంది నేడు
అంతర్గత విషయాలను సైతం బహిరంగంగా
తెలియజేస్తున్న అనాలోచిత సమాజం.
ఇంటర్నెట్‌తో సహజీవనం చేస్తున్న నేటి తరం
అవసరానికి మించి వాడితే జీవితం అవుతుంది వ్యర్థం.
మంచి విషయాలు తెలుసుకోవడానికి
కావాలి ఇంటర్నెట్ ఓ నేస్తం.
అనవసరమైన విషయాల వేటలో
పడి ఆగం కాకూడదు ఎవ్వరం.
హద్దులు చెరిపేస్తున్న అంతర్జాలం నేడు మానవ
సంబంధాల పాలిట క్రూర మృగం కాకుండా
వినియోగించుకోవాలి ప్రతి ఒక్కరం.
అపరిచిత వ్యక్తుల పరిచయాల పట్ల అనుక్షణం
అప్రమత్తంగా ఉండడం అత్యంత అవసరం.
రసవత్తరమైన రీల్స్ మాయాజాలం
మత్తులో ఏ రోజు మునిగిపోకు.
మాయమాటల వలలో చిక్కి కాలాన్ని సాగనంపకు అది
ఏదో రోజు గుణపాఠం అవుతుందని మరువకు.
వీక్షకుల కోసం వ్యక్తిత్వ విలువలను దిగదార్చుకు అది
నీ జీవితానికి అవుతుంది పెనుముప్పు.
లైకుల కోసం వెంపర్లాడి మంచి లక్షణాలను మసి
చేయకు ఆ తరువాత శూన్యం
మిగులుతుందని గుర్తించు.
ఆగంతకుల సావాసాన్ని స్వాగతిస్తే అదే కుటుంబ
అనుబంధాల మధ్య చిచ్చుకు
కారణం అవుతుంది గమనించూ.
కానీ విని ఎరగని వింత రంగుల సోషల్ మీడియా
ప్రపంచం అది తెలుసుకోలేక
ఎంతోమంది జీవితాలు చింద్రం.
సోషల్ మీడియాలో అనుమానస్పద వ్యక్తుల స్నేహం
ఆదిలోనే నిలవరించుకో నేస్తం
లేదంటే బతుకు అంగడిపాలు కావడం తథ్యం
అంతర్జాలం అనంతమైన ఊహల లోకం అందులో ఓ
బాటసారిగా ఉండడం ఉండాలి తప్ప బలిపశువు
కాకుండా ఉండడం వివేకం.
తీయని మాటల పలకరింపుల పెంట నమ్మించే
నయవంచకుల పంట ఇదంతా సోషల్ మీడియా
తంటాని గుర్తుంచుకో ఈ మాట.
అబ్బురపరిచే అందాల ఫోటోలు జీవితాన్ని
అల్లరి పాలు చేసే రూపాలు.
మతి తప్పి ప్రవర్తించేలా సోషల్ మీడియా తీరుతెన్నులు.
బెట్టింగ్ యాప్‌లకు బలిఅవుతున్న
యువత కుటుంబాల ఆర్తనాదాలు.
చిన్న వయసులో తనువు చాలించుకునే ప్రయత్నాలు
అంతుచిక్కని సోషల్ మీడియా మహిమలు
హనీ ట్రాప్ లా బారినపడిన ఆత్మహత్యల సంఘటనలు
ఆన్లైన్ ఆటలతో పెరుగుతున్న హైపర్ టెన్షన్లు
విపరీతమైన మానసిక ఒత్తిడిలు ఇవన్నీ సోషల్
మీడియా తాలూకా ఘోరాలు.

వంశీకృష్ణ గౌడ్ బండి,
జయశంకర్ భూపాలపల్లి జిల్లా, 9550837962

## షష్ట్యబ్ది పరంపరాభవ యుగాదిభావం

కం.
శ్రీరస్తను శుభమస్తను
శ్రీరాజిలు పేర్లుగాది సేమపరంప
ర్నారాధ్యవిఘ్నుమస్తను
పేరుపరాభవ విజయము పిలుపామనియౌ
కం.
కొక్కొరొకోకూతశుభము
చక్కని సూర్యోదయము ర సాలము చివురుల్
మెక్కుచు పికగళ పులకలు
మక్కువ సుస్వర వసంత మాధురి ఘనమౌ
మ.
ఇలలోనప్పుడు పూలవాటికలు హాయింగూర్చు సత్సందడిన్
వలపామామిడి నందగించెనన వహ్వాగీతవాసంతమా
గళమా సుస్వర మాశ్రయా సుకర ణాకాంక్షా కృతౌకోకిలల్
తలబోతల్గనసంతసమ్మొదవులాదారుల్ సుఖాలాపముల్
తే.గీ.
సర్వకార్యములందును జయము కలుగు
వినతులాలించి పాలించు వినుత పర్వ
గర్వమునుగాది జనులక ఖండ కీర్తి
సుప్ర భాతప రంపరా భవము శుభము


డా. జొన్నలగడ్డ మార్కండేయులు
9440219338
పేరవరం అంబేద్కర్
కోనసీమ జిల్లా ఆంధ్రప్రదేశ్

## అపరిచితులు

పరీక్షలు దగ్గర పడుతున్నాయి. అనూష పుస్తకాలు ముందేసుకొని కూర్చొంది. పక్కవాటాలోంచి ఏవో అరుపులు, కేకలు వినిపిస్తున్నాయి. ఆంటీ, అంకుల్ మళ్ళా ఏదో గొడవ పడుతున్నట్లున్నారు. వాళ్ళకి ఒక్కక్షణం పడదు. నిత్యం ఏదో ఒక తగువుకు దిగుతూనే ఉంటారు. చీటికి మాటికి మాటల యుద్ధంలో మునిగి తేలుతుంటారు.... పరీక్షలు పూర్తయ్యాయి. అనూష తీరిగ్గా ఆలోచించడం మొదలు పెట్టింది. తన భవిష్యత్ గురించి బెంగ మొదలయింది.

తల్లిదండ్రులను వదిలి ముక్కుమొహం కూడ తెలియని వ్యక్తితో జీవితాంతం గడపాల్సి వస్తుందన్న ఆలోచనే భయంగా అనిపిస్తుంది. ఆలోచనల ఐక్యత ఉన్నవారే పెళ్ళిళ్ళ చేసుకోవాలి. పరస్పర అవగాహనతోటే పెళ్ళిపీటలు ఎక్కాలి. ప్రేమలేని వివాహం మరణంతో సమానం. చుట్టూ ఉన్న సమాజాన్ని గమనిస్తూ పెరిగిన తను ఎంతోమంది స్త్రీలు తమ ఇష్టాల్ని, ఆశల్ని త్యాగం చేసి, పెళ్ళి అనే బంధంలో బంధించబడిన దృశ్యాలను చూసింది. ఇదేనా జీవితం? నూతన వధూవరులు అపరిచితులుగా జీవితాన్ని ప్రారంభిం చవలసిందేనా? ఆలోచనలు ఒక కొలిక్కి రావడంలేదు. ఆరోజు రాత్రి అనూష అనూష అంటూ తండ్రి పిలిచాడు. నీకు మంచి సంబంధం వచ్చిందమ్మా. అబ్బాయికి బెంగుళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం. గౌరవ, మర్యా దలు గల కుటుంబం. బాగ ఆస్తిపాస్తులున్నాయి. ఏమం టావ్? అని అడిగాడు. నా పెళ్ళికి ఇపుడేం తొందర వచ్చిం దిలే నాన్నా అంటూ అప్పటికి తప్పించుకుంది. రోజులు గడుస్తున్నాయి.

పెళ్ళిచేసుకోవాలంటూ అమ్మానాన్నలు బాగా వత్తిడి చేస్తున్నారు. తను తన ఆలోచనలను చెప్పింది. తన భయాలను వెల్లడించింది. కాని వాటిని వారు పెడచెవిన పెట్టారు. 'పెళ్ళి తర్వాత అన్నీ సర్దుకుంటాయి' అంటూ తన మాటలను లెక్కచేయలేదు. తన ఆత్మాభిమానం, భావాలు ఎవరికీ పట్టలేదు. తనలో అంతర్గత సంఘర్షణ. చివరకు తన అంగీకారం లేకుండానే పెళ్ళి తేదీకూడా నిర్ణయించబడింది. అబ్బాయితో మాట్లాడటానికి కూడా తల్లిదండ్రులు ఒప్పుకోవడంలేదు. పెళ్ళికొడుకు కూడా అలాంటి ప్రతిపాదన ఏదీ తేలేదు. అవగాహన లేకుండా, తన ఆలోచనలకు విరుద్ధంగా పెద్దలు కుదిర్చిన సంబంధాన్ని చేసుకోవడానికి మనస్సు సుతారమూ అంగీకరించడంలేదు. రేపే పెళ్ళీ ఆలోచనలతో బుర్ర వేడెక్కిపోతుంది. అర్ధరాత్రి సమయములో చివరకు ఒక కఠినమైన నిర్ణయం తీసుకుంది. పెళ్ళికి అన్ని ఏర్పాట్లు జరిగాయి. పెళ్ళి మండపం కళకళ లాడిపోతుంది. పెళ్ళివారంతా వచ్చారు. కానీ వధువు కనిపిం చడం లేదు. అనూష ఆత్మహత్య ఆకుటుంబానికి విషాదాన్ని, సమాజానికి ఒక గట్టి ప్రశ్నను వదిలింది. 'మనస్సును చంపుకుని, జీవితాంతం రాజీపడి బ్రతకడం అవసరమా? అది జీవితం అవుతుందా?.' అనూష జీవితం శారీరకంగా ముగిసినప్పటికి, ఆమె ఆలోచనలు యువతులకు, సమాజానికిఒక వెలుగుగా మారాయి. ఇప్పుడు ప్రేమతో, అవగాహనతో, మనస్సుకలిసిన వ్యక్తితోనే జీవితాన్ని ప్రారంభించాలని నిర్ణయించుకొంటున్నారు. ఆమె స్నేహితురాళ్ళు పరిచయం లేని మొగుళ్ళు మాకొద్దని తమ ఇళ్ళల్లో తెగేసి చెప్పారు. పెద్దలు కూడా ఆసంఘటనతో పాఠం నేర్చుకొని, పెళ్ళికి ముందు వధువు, వరుడు ఒకరిని ఒకరు పరిచయం చేసుకోవటానికి అవకాశాలను కల్పిస్తున్నారు. అనూష విషాదం ప్రతిఒక్కరికి ఒక సందేశం ఇచ్చింది. 'సంప్రదాయాలు, గౌరవాలు, సంపదలు అవసరం ఉండవచ్చు. కాని ప్రేమ, అవగాహన, స్వేచ్ఛకు మించి ఏదీ ముఖ్యంకాదు.' ఆమె కథ సమాజంలో ఒక స్ఫూర్తిగా, యువతుల గుండెల్లో, పెద్దల చింతనల్లో శాశ్వతంగా నిలిచింది. చివరకు ప్రతిఒక్కరు ఒకే ప్రశ్నను అడుగుతున్నారు - మనస్సుకు మెచ్చినవిధంగా, అవగాహనతో జీవించడం ముఖ్యంకాదా?



డా. పి.సి సాయిబాబు
99635 21857

## సాయి సాహిత్య ముచ్చట్లు 3

**తే.గీ.
అన్య భాషల మోజులో నమ్మ నుడిని
మరచి పోవుచు నుంటిమి పుడమి పైన
తీయ తేనియలొలుకు నా తెలుగు బాస
నిలుపుకొనవలె మాటలు మనము నేడు**

## పరభాషల పడగనీడలో తెలుగు భాష మనుగడ

భాష జాతి ఉనికి అందులో మన సమాజం, సంస్కృతి, సంప్రదాయం నిండుగా ఉంటుంది. మనిషి ఆలోచనలను వ్యక్తపరచే ప్రధాన సాధనం మాతృభాష. భారత దేశం బహుభాషల నిలయం ఇక్కడ అనేక భాషలు ఉన్నప్పటికీ వాటిలో ప్రత్యేకమైన స్థానం సంపాదించుకు న్నభాష తెలుగు. తెలుగు భాషను **"ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్"** అని కొనియాడారు. అందులోని మాధుర్యం, లాలిత్యం, సరళత ఇందుకు కారణం. తెలుగు భాష ప్రపంచంలో అత్యంత ప్రాచీనమైన, సుసంపన్నమైన నాగరక భాషలలో ఒకటి.

మూల ద్రావిడ భాషనుంచి సంక్రమించిన దేశ్యపద సంపదను, ఆదిమదశనుంచి వ్యాప్తి చెందుతూ పెంపొందించుకున్న తేటతెనుగు మాటలు మరికొన్ని, తరతరాలుగా అన్యభాషల సంపర్కంతో మెలిగి చేర్చుకున్న అన్యదేశ్యాలు మరికొన్ని. ఇవన్నింటి కలయికతో నేడు తెలుగు భాష విరాజిల్లుతుంది. కొత్త పదాలు చేరడానికి ముఖ్యమైన అనేకానేక కారణాలు. ఇతర భాషలనుండి అవసరార్థం తీసుకునే పదాలని ఆదానాలని అంటారు. ఒక భాషా వ్యవహర్త ఒక వస్తువుని గాని ఒక భావాన్ని గాని సూచించడానికి తగిన పదం తన భాషలో లేనప్పుడు తనకు సన్నిహిత సంబంధము గల వ్యవహర్తల భాషలో ఆ పదం ఉంటే దాన్ని స్వీకరిస్తాడు. (తెలుగు భాషా చరిత్ర, పుట 314)

### తెలుగు భాష ఆవిర్భావం...

తెలుగు భాష ద్రావిడ భాషాకుటుంబానికి చెందినది. ఈ భాషకు మూడు వేల సంవత్సరాలకు పైగా చరిత్ర ఉందని పండితులు ఆధారాలు చూపుతున్నారు. ప్రాచీనంనుండి శాసనాలు, పురాణాలు, కావ్యాలు, ప్రబంధాలు, శతకాలు, నాటకాలు, యక్షగానాలు, జానపద సాహిత్యం, ఆధునికంగా వచన కవిత్వం, నవలలు, కథలు ఇలా ఎన్నింటి ద్వారానో నాటినుండి నేటివరకూ తెలుగు భాష అభివృద్ధి చెందుతూనే ఉంది. మొద ట్లో వాడుకభాషగా పరిఢవిల్లిన కాలంనుండే రాజ్య వ్యవస్థలో శాసన భాషగా వాడుకలోకి వచ్చింది. తరువాత సాహిత్య భాషగా ఎదిగింది. అనాదిగా తెలుగుకు గొప్పగొప్ప కవులు, ప్రసిద్ధిచెందిన రచయితలు ఉన్నారు. వారి రచనల ద్వారా నాటినుండి నేటివరకు ఈ భాషను గొప్పగా తీర్చిదిద్దారు.

### తెలుగు భాష ప్రత్యేకత....

తెలుగు భాషలో ప్రతి పదం స్వరంతో ముగుస్తుంది. అందువల్ల ఈ భాష వినడానికి చాలా మధురంగా ఉంటుంది. తెలుగు అక్షరమాల కూడా చాలా సమగ్రమైంది. ఈ భాషలో భావా లను సమగ్రంగా వ్యక్తపరచవచ్చు. పద్యరచన, గేయరచన, కథలు, నవలలు వంటి అన్ని రకాల రచనలకు తెలుగు భాష ఎంతో సానుకూలంగా ఉంటుంది.

### ఆధునిక కాలంలో తెలుగు....

ఆధునిక కాలంలో కూడా తెలుగు భాష విస్తృతంగా వినియోగంలో ఉన్నా దానివాడుక తగ్గుముఖం పట్టిన పరిస్థితిని గమనించవచ్చు. విద్య, ఉద్యో గాల్లో ఆంగ్ల ప్రాధాన్యత పెరగడం వల్ల తెలుగు వాడుక తగ్గు తోంది. దేశభాషలందు తెలుగు లెస్స" అని శ్రీకృష్ణదేవరా యలు కొనియాడిన మన మాతృభాష, నేడు ఒక క్లిష్ట పరిస్థితిని ఎదుర్కొంటోంది. ప్రపంచీకరణ (Globalization), సాంకేతిక విప్లవం వల్ల తెలుగు భాషపై అన్యభాషల ప్రభావం, ముఖ్యంగా ఆంగ్ల భాషా ప్రభావం పెరిగిపోయింది. దీనివల్ల భాషా స్వరూపమే మారిపోయే ప్రమాదం పొంచి ఉంది.

### ఆంగ్ల మాధ్యమ విద్య:

నేడు విద్య అంటేనే ఆంగ్లమనే భావన సమాజంలో బలంగా నాటుకుపోయింది. ప్రాథమిక స్థాయి నుంచే తెలుగును ఒక సబ్జెక్టుగా కూడా సరిగ్గా చదవకపో వడం వల్ల పిల్లలు మాతృ భాషకు దూరమవుతున్నారు. కార్పొ రేట్ విద్యాలయాలు తెలు గును ఒక సబ్జెక్టుగా బోధించకపోగా బడి ఆవరణలో తెలుగులో మాట్లాడితే దండనలు బలంగా ఇవ్వడం విడ్డూరం, మాతృభాషలో వర్ణమాల కూడా విద్యార్థులకు నేర్పించక పోవడం వల్ల విద్యార్థులు తెలుగు పదాలకు దూరమ వుతున్నారు.

### ఉద్యోగ అవకాశాలు:

రెండు తెలుగు రాష్ట్రాలు అధికారభా షగా తెలుగును తూతూమంత్రంగా వాడుతున్నారేగాని, పాల నారంగంలోనూ, విద్యారంగంలోను, న్యాయరంగంలోను తెలుగును ఖచ్చితంగా అమలుపరచాలనే నిర్ణయాలను తుం గలో తొక్కేశారు. ఆధునికంగా ఎగబ్రాకిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఆంగ్లమే ప్రాధాన్యం అనడంతో అదొక్కటే ఉద్యోగం అన్న ధోరణిలోకి ప్రభుత్వాలు పోయి ఆంగ్ల మాధ్యమం ఆంగ్ల మాధ్యమం అని ఘోషిస్తున్నాయి. చాపకిందనీరులా ఆంగ్ల విద్యకై పుట్టగొడుగుల్లా కాన్వెంటులు, కార్పొరేట్ బడులు, ఇంటర్నేషనల్ బడులు మూలమూలకూ చొచ్చుకున్నాయ్. దీంతో తెలుగు భాష కేవలం ఇంటి భాషగా మిగిలిపోతోందన్న నిజం బరాయించలేకపోతున్నారు తెలుగు భాషోద్యమకారులు.

ఇంటిభాషకు కూడా ఆంగ్ల జాఢ్యం పట్టింది అనడానికి ఉదా: ఆంగ్లంలోని అంకుల్ అనే పదం నేడు మన సమాజంలో విపరీతంగా వాడుకలోకి వచ్చేసింది. దీనివల్ల మన కుటుంబ వ్యవస్థలోని మామ(మేనత్తభర్త) మేనమామ, (పిల్లను ఇచ్చిన/ తీసుకున్న వారి తండ్రి) మామగారు, పెదనాన్న, చిన్నాన్న వంటి బంధుత్వ పదాలన్నీ అంతరిస్తున్నాయి. అలాగే ఆంటీ అనే ఆంగ్ల పదం. ఇదే కోవలోకి చెందిన పదాలు బ్రో, బ్రదర్, మమ్మీ, డాడి ఇలా అనేక పదాలను మనం దిగుమతి చేసుకు నేసి వాడెయ్యడం అలవాటు చేసుకునేశాం. మరోతరానికి అమ్మ, నాన్న, చెల్లాయ్, అక్క, అన్న, తమ్ముడు ఇలా ఎన్నో బంధువాచక పదాల అర్థంలోని తేడా తెలియకుండా పోయే ప్రమాదంలోకి తెలుగు భాషను మనం నెట్టేస్తున్నాం. ఇలా దేశ్య జీవన విధానంలోని ఏ అర్థక్షేత్రం తీసుకున్నా మనం పోగొట్టు కున్న పోగొట్టుకుంటున్న పదాలు కొల్లలు కనపడతాయి. భాషను కాపాడడం అంటే మన మాటలను మనం వినియోగించడం.



డి. సాయినాథ్ రెడ్డి
6305584064
హైదరాబాద్ విశ్వవిద్యాలయం

## సాహిత్య రచనలకు ఆహ్వానం

ప్రతి ఆదివారం *నినాదం* పత్రిక సాహిత్య అనుబంధం కోసం వ్యాసాలు, సమీక్షలు, కవితలు, చిన్న కథలను ఆహ్వానిస్తున్నాం. వ్యాసాలు రెండు పేజీలకు మించకుండా లేదా 400 పదాలలోపు ఉండేటట్లు చూసుకోవాలి. ఈ రచనలను ఈ మెయిల్ లేదా వాట్సాప్‌కు పంపించాలి.

sahityalahari0@gmail.com
Whatsapp No:6305584064